# అప్పావుపిళ్ల ఆత్మఘోష

మనిషిగా పుట్టిన ప్రతి వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు ఆవులిస్తాడు. అయితే అప్పావుపిళ్ల ఆవులించడం ఒక ప్రత్యేకత!

అప్పావుపిళ్ల ఆవులిస్తే - 'ఆ కు దీర్ఘమిస్తే ఆ!' అని గుణింతం దిద్దే పిల్లవాడి దీర్ఘంలా ఆరంభమై ఒక మహా గాయకుని ఆలాపనలా తారాస్థాయిని చేరి ఆపై గిరికీలు కొడుతూ మంద్రస్థాయి చేరే సరికి అయిదు నిముషాలు పడుతుంది.

అప్పావుపిళ్ల ఆవులిస్తూనే నిద్రపోతాడు. నిద్రపోతూ ఆవులిస్తాడు.

ఇంటి ముందు వసారాలో పడుకొనే అప్పావుపిళ్ల ప్రతి నిత్యం అయిదు గంటలకే నిద్రలేస్తాడు. లేస్తూనే ఆవులిస్తాడు. ఆ ఆవులింత ఇటువైపు నాలుగిండ్లకు... అటువైపు నాలుగిండ్లకు అలారంలా పని చేస్తుంది. "అరెరె! అప్పావు అయ్యోరు ఆవులించినాడే. అయిదైపొయ్యింది గెంట!"' అంటూ అమ్మలక్కలు పనిలో పడతారు. ఇక తప్పదన్నట్లుగా నిక్కుతూ నీలుగుతూ లేవలేక నిద్రలేచి పలకా పుస్తకాలు ముందు పెట్టుకొని కండ్లు నులుముకొంటూ గొణగడానికి ఆరంభిస్తారు విద్యార్థులు!

అయితే ఆరోజు అప్పావుపిళ్ల నిద్రలేచే సరికి ఊరూరుగా ఇండ్లల్లోని ఆడవాళ్లంతా వీధులమీద పడ్డారు. అది అప్పావుపిళ్ల ఊహించని మార్పు. అందుకే ఆశ్చర్యపడ్డాడు. ఆశ్యర్యంలోపడి ఆవులించడమే మరిచిపోయాడు!

అది అంతవరకూ తన జీవితంలో జరగని సంఘటన.

అందుకే అప్పావుపిళ్ల కాసేపు ఆలోచనలో పడ్డాడు. జరగకూడనిదేదో జరిగిపోయినట్లు విచార పడ్డాడు. ఆ తర్వాత వీధులవైపు చూశాడు. అప్పటికే కొందరు ఆడవాళ్లు ఇండ్ల ముందర చెత్త ఊడుస్తున్నారు. కొందరు కళ్లాపులు చల్లుతున్నారు. కొందరు ముగ్గులు పెడుతున్నారు. వాళ్లల్లో హుషారు గమనిస్తూ ఉంటే పోటీతత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తూ ఉంది. అది ఒక వింతల్లో వింతగా తనకు తోస్తే వసారాలో కూర్చొని వీధుల తట్టు తేరి పార చూసి చివరగా తన ఇంటి వాకిలి వైపు చూశాడు.

పెద్దమ్మాయి పుష్పలత. చిక్కని పేడనీళ్లతో వీధి ఈచివర నుండి ఆ చివర వరకు చక్కగా కళ్లాపు చల్లింది. రంగు రంగుల ముగ్గులు పోస్తూ ఉంది. తాను ఆవులిస్తూ నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకొని "వయసుకొచ్చిన ఆడబిడ్డ ఇంకా నిద్రపోతూ ఉంటే ఎట్లమ్మా? పుట్టింటి అలవాట్లు మెట్టినింట సాగుతాయా?" అని మందలిస్తే చెవుల్లో వేసుకోకుండా ముసుగుతన్ని ముడుక్కొనే అమ్మాయి తనకంటే ముందుగా లేచి వాకిలికి వైభవం తెస్తూ ఉందే? ఏమిటి విశేషం? అని అనుకొంటూ ఆ ముగ్గువైపు చూశాడు అప్పావుపిళ్ల. తన కండ్లను తానే నమ్మలేనట్లుగా చూపుల్ని అదుపులోకి తెచ్చుకొన్నాడు. ఒకింత పెద్దవిచేశాడు. నిదానించి చూశాడు. ఆ ముగ్గు మధ్య అందంగా 'విష్‌యు ఎ హ్యాపీ న్యూ ఇయర్!' అని కనిపించే సరికి అప్పుడు అర్థమైంది అప్పావుపిళ్లకు ఆనాడు సంవత్సరాది అని. అయితే అది తెలుగు సంవత్సరాది కాదు. ఆంగ్ల సంవత్సరాది!

అప్పుడు ముగ్గులు వేస్తున్న పెద్ద కూతుర్ని పరికించి చూశాడు అప్పావుపిళ్ల. ఆమె ముచ్చటగా వేస్తున్న రంగు రంగుల ముగ్గుల్ని చూశాడు. అప్పుడప్పుడే ముగ్గుల ముఖాల్లోకి తొంగి చూస్తున్నాడు సూర్యుడు. ఆమె కంటే అందంగా ముగ్గు... ముగ్గు కంటే అందంగా ఆమె కనిపిస్తున్నారు. గుబురు మీసాల్ని చీల్చుకొని ఒక చిరునవ్వు. దాన్ని సవాలు చేస్తూ ఆకస్మికంగా ముఖాన పడ్డ చినుకులా విషాదం! అవును. ఆ అమ్మాయి వయస్సుకు వాళ్లమ్మ ఒక బిడ్డతల్లి! అప్పావుపిళ్ల కడుపులో చెయ్యేసి దేవినట్లయింది.

కన్నీటి పొరల తెరలమీద గతం ఒక దృశ్యమయింది!

తన కుటుంబ వారసత్వానికి కట్టుబడి ఉంటే తానూ ఒక గ్రామకరణం బాధ్యతల్ని నెత్తికెత్తుకోవాల్సింది. అయితే అది తన మనస్తత్వానికి పూర్తిగా విరుద్ధం. గ్రామాల్లో ఆకక్షలూ.... కార్పణ్యాలూ... ఎత్తులకు పై ఎత్తులూ .... కోర్టులూ ఈ గొడవల్లో తానొక పావుగా మిగలదలచుకోలేదు. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలతో పనిలేకుండా చదువుకొన్నాడు.

చదువు పూర్తి అయితే ఉద్యోగం. ఈవ్యవస్థలో చదువుకొన్న ప్రతివాడూ ఠంచనుగా ముస్తాబై ఆఫీసుకు వెళ్ల గలిగితేనే దాని పేరు ఉద్యోగం. కడుపుకు అంత కూడు కావలసిన సౌకర్యాలు సమకూర్చగల ఏ పనిచేసినా అది ఉద్యోగం అనిపించుకోదు. అందుకే అప్పావుపిళ్ల కూడా ఉద్యోగాన్వేషణలో పడ్డాడు. బతుకు లేనివాడు బడిపంతులన్నారు. బతికితే బడిపంతులుగానే బతకాలి! అనుకొన్నాడు అప్పావుపిళ్ల. ఒక ప్రాథమిక పాఠశాలలో తాను సెంకండరీగ్రేడ్ అయినా హయ్యర్ గ్రేడ్‌ఖాళీనే భర్తీచేశాడు.

చదువు. ఉద్యోగం. మనిషి బ్రతుకులో ఈ రెండూ సమకూడితే ఆ తరువాత తప్పనిది సంసారం!

ఒక శుభముహూర్తాన ఏ తల్లిదండ్రులో 'అయ్యో! ఆడకూతురా?' అని కనుక్కొన్న ఒక ఆడబిడ్డ అప్పావుపిళ్ల జీవితంలో భాగస్వామినిగా చేరింది. అప్పుడు తానేమైనా కట్నాలూ కానుకలూ అన్నాడా? లేదు. 'వస్తు వాహనాలని సతపోరాడా? లేదే? అదే తాను తన బిడ్డను

ఒక ఇంటిదాన్ని చేయాలంటే? అవే అడ్డుపడుతున్నాయి!

ఈ ఆలోచన మనసులో మెదిలేసరికి తానొక ప్రళయరుద్రుడు కావాలనుకొన్నాడు అప్పావుపిళ్ల. కట్నమడిగే ప్రతి యువకుడి గొంతు కొరికి నెత్తురు తాగాలని ఆవేశపడ్డాడు. ఆ ఆవేశంలో అటూ ఇటూ కదలలేక పోయాడు!

మనిషి కదలలేక పోతే మనసు?- అది కదిలింది. వీధుల మీద పడింది. ఇంటింటి ముందు ముగ్గులే. ఆ రంగురంగుల ముగ్గుల్లో 'హ్యాపీ న్యూ ఇయర్ రాతలే!'

గబగబా లేవాలనుకొన్నాడు. లేచినంత తొందరగానే వీధులమీద వీర విహారం చేస్తూ పోసిన ముగ్గుల్ని ఈ కాలితో ఆ కాలితో దున్నుతూ చెరిపి పారేయాలనుకొన్నాడు. అంతా చెరిపివేసిన పిదప ఆ ముగ్గుల్ని పోసిన పడుచుపిల్లల్ని తన కూతురితో కూడా కలిపి వరసగా నిలబెట్టి ఈ చెంపా ఆ చెంపా కసి తీరేదాకా వాయించాలనుకొన్నాడు. అనుకొన్నాడే కానీ ఆపని చేయలేక పోయాడు. అనుకొన్న పని చేయలేనప్పుడు ఎవడికైనా చేతనయింది ఆలోచన కాబట్టి అందులో పడ్డాడు అప్పావుపిళ్ల.

"అసలు ఈ జనానికి బుద్ధుందా? ఉంటే తామెటు వెళుతున్నామో? ఆమాత్రం అర్థం చేసుకోలేరా? ఎప్పుడో తెల్లవాళ్లు వదిలిపెట్టి పోయినా వాళ్ల ఆచార వ్యవహారాల్ని మాత్రం వదలలేక పోతున్నారే!...ఔరా తెల్లోడా! ఎంత మంచి పునాదులు వేశావురా! పోనీ! నీ స్వార్థంతో నువ్వు చేసినావు సరే! ఈగొర్రెల ఆలోచనేమయింది? పీర్ల పండక్కు అయ్యవారికి ముడిపెడుతున్నారే! అసలు మనకొక సంస్కారముంది. సంస్కృతీ ఉంది. మనకూ ఒక సంవత్సరాది పండుగ ఉందని మరిచి జనవరి ఒకటి మీద పడుతున్నారే ఈ మనుషులు. వీళ్లకేం పోయేకాల మొచ్చిందో! పాలోమని వీధుల మీద పడి ఎక్కడి చూసినా 'విష్‌యు ఎ హాపీ న్యూఇయర్!!' అని రక రకాల ముగ్గులు పోస్తారా! వీళ్ళందరినీ నిలువునా చీల్చినా పాపం లేదు!!"

ఈ ఆలోచనలతో కంపించిపోయాడు అప్పావుపిళ్ల. అయితే అటు యిటు కదలలేక ఆ కుక్కిమంచానికే అతుక్కుపోయాడు. చూపు ముగ్గులతో ముడిపడ్తే అతడిని మనస్సు గతం ముగ్గులోకి లాగింది. గతం అందంగా కనుల ముందు మెదులుతూ ఉంది.

తాను పుట్టింది ఒక పల్లెటూర్లోనే అయినా ఆ పల్లెలో ఉగాది పండుగ ఎంత సంబరంగా జరిగేది తన చిన్నతనంలో. అమ్మ కోడికూతతో మేలుకొనేది. ఇంటిల్లిపాదికీ తలంటి స్నానం చేయించేది. కొత్త బట్టలు తొడిగేది. కొత్త బెల్లంతో వేపపూత, చింతపులుసు కలిపి పచ్చడి చేసేది. అప్పుడు అర్థం కాలేదు. కానీ ఇప్పుడు అర్థమవుతూ ఉంది ఆ పచ్చడి జీవితానికే సంకేతమని. జీవితమంటే చేదు తీపుల సమ్మేళనమే అని. తాను ఊరి మీద పడేవాడు. ఈడు వాళ్లతో పొద్దస్తమానం గచ్చకాయలాడేవాడు. పెద్దవాళ్ళేమో రామాలయంలో కూర్చొని పిచ్చయ్యశాస్త్రి చదువుతుంటే పంచాగం ఎంతో ఆసక్తిగా వినేవాళ్లు. అవన్నీ ఏమైనాయి ఈనాడు? రాను రాను నాగరికత వాత పడిన మన ఆచార వ్యవహారాలు మంట గలిసి పోవలసిందేనా?

ఈ భావన మనసులో మెదిలే సరికి అప్పావుపిళ్ల నిలువెల్లా వణికిపోయాడు. ఏదో ఘోరం జరిగిపోతున్నట్లు, భారతీయత తారుమారయిపోతున్నట్లు తపించిపోయాడు. ఏం చేయాలి? అని తనలో తాను ప్రశ్నించుకొన్నాడు. ఏమీ చేయలేక కుక్కి మంచంలో అలానే కూలబడ్డాడు.

"ఏమండీ! ఇంకా అట్లానే కూర్చున్నారే? పొద్దుబారడెక్కింది. ఏడాది కొక్కపూట. పండగ పూటైనా పెందలాడే లేచి స్నానం చేస్తారా? లేదా?" అప్పావుపిళ్ల సతీమణి ఇంట్లోకి జొరబడుతూ చెవిలో జోరీగ అయింది.

మాటల్లో కాస్త నిష్ఠూరం చోటుచేసుకున్నా మరొక్కప్పుడైతే ఆ మాటల వెనుక నివురు గప్పిన అభిమానానికి అప్పావుపిళ్ల ఆ కుక్కి మంచం మీదనే అందలమెక్కినంత ఆనందపడి అదోరకంగా చూసి ఇంకో రకంగా నవ్వేవాడు. కానీ ఆనాడు సతీమణివైపు విప్పారిన కండ్లతో వింతగా చూశాడు.

పెండ్లినాటిది ఆనాటికీ ఈనాటికీ ఏనాటికీ పోటీ లేకుండా నిలబడింది ఒక్కటే చీర-ధర్మవరం పేటంచు సరిగ చీర సింగారించింది. అంతకు ముందే తలస్నానం చేసినట్లుంది. తలకూడా ఆరలేదు. కాన్పుకు పిడికెడు జుట్టు ఊడిపోతే ఆ ఏటా బాలింతరాలికి పిడికెడు జుట్టు. ఆ జుట్టు నుండి నీళ్లు బొట్లు బొట్లుగా పడుతున్నాయి. చేతిలో హారతితట్ట ఉంది. తట్టలో కొబ్బెర చిప్పలు, పూలు పండ్లు వగైరా ఉన్నాయి. అమ్మగారి మొహంలో పూజ సలిపిన సంతృప్తి చిలికిన మజ్జిగలో తేలుతున్న వెన్నలా తేలుతూంది.

"అయితే ఏడాదికొక్కగానొక్క పండగని గుడిలో పూజలు చేసి వస్తూందన్నమాట ఇల్లాలు! 'బాగుంది' అని తనలో తాను గొణుక్కొన్నాడు అప్పావుపిళ్ల. గొణుక్కొంటూ ఆగ్రహోదగ్రుడయ్యాడు. అటుపై ఆవేశంతో ఎగిరిపడి లేచాడు. ఆమె చేతిలోని తట్టను పెరుక్కొని విసిరి వీధిలోకి కొట్టి పిడికెడుకే అందని ఆమె జుట్టును పిడికెడు నిండుగా పట్టి మొగాన్ని వాటంగా తిప్పుకొని ఈ చెంపా ఆ చెంపా వాయించాలనుకొన్నాడు. అనుకొన్నాడే కానీ ఆ పని చేయలేక అటూ ఇటూ కదలలేక కోపంతో కొంచెంసేపు ఊగిసలాడాడు.

భర్త వైఖరి అర్థంకాక భార్య నిలువుగుడ్లతో నిలబడిపోయింది.

అక్కడి నుండి ఒక్క పరుగులో ఆ ఊరి దేవాలయం చేరాలనుకొన్నాడు అప్పావుపిళ్ల. ఆ దేవాలయంలో దేవుని ముందు నిలబడి 'ఒరే దేవుడా! వీళ్ళందరికీ బుద్ధిలేదనుకో! నీ బుద్ధేమయిందిరా? పీర్ల పండగనాడు నోముల వ్రతమన్నట్లు పూజలు నువ్వెట్లా గ్రహిస్తున్నావురా? అయితే-ఆ తెల్లోళ్లు నీగ్గూడా వేశారన్నమాట టోపీ! అందుకే వీళ్లందరి పూజలతో నువ్విట్లా కులుకుతున్నావు!" అని అడగాలనుకొన్నాడు. అయినా అడుగు ముందుకు వేయలేక ఆవు వెంట దూడలా ఆమె వెంట తలవంచుకొని లోనికి వెళ్లాడు.

అప్పావుపిళ్ల అభ్యంగన స్నానం చేశాడు. అంతలోపల అమ్మగారు అయ్యగారికి ఉన్న మూడు జతల బట్టల్లో అతడు కట్టుకొన్నవి మనహాయిస్తే మిగిలిన రెండు జతల్లో కాస్త

అక్కడక్కడా కుట్లు తక్కువపడ్డ పంచను, చొక్కాను నవ్వుతూ అందించింది. అవీ పాతవే!... చిరిగినవే!...అక్కడక్కడా కుట్లుపడ్డవే! అయినా ఆమె అనురాగం పాతబడలేదు. చినిగి కుట్లు పడలేదు. అందుకే ఆనందంగా అందుకున్నాడు. అంతకంటే దర్జాగా ధరించాడు. ఇంటిగోడ పాలుసులూడి పళ్లూడిన దవడలా తయారైంది. ఆ గోడమీద మరకలు తేలివేలాడుతున్న అద్దం. ఆ అద్దం ముందు నిలబడ్డాడు. నూగులూ బియ్యం కలసోసిన స్థితిలో ఉన్న బుర్ర మీసాల్ని దువ్వుకొన్నాడు. హుందాగా వసారాలోకి నడిచాడు.

ఇంటి వసారాలో అడుగుపెట్టి ఇంటి ముందు నిలబడి ఉన్న గుంపును చూసి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు అప్పావుపిళ్ల. ఆ గుంపువైపు ఒక్కసారి తేరిపార చూశాడు. అందరూ తన బడిలోని విద్యార్థులని తోచే సరికి తోక తొక్కిన త్రాచే అయ్యాడు. ఒక చింత బరికె చేతికందుకొని అందరి వీపులూ చితగ్గొడుతూ దిక్కు కొకర్ని తరమాలనుకొన్నాడు.

అయ్యవారి ఆగ్రహాన్ని గమనించిన పిల్లలు పాపం అటూ ఇటు కదల్లేకుండా అలాగే నిలబడిపోయారు. అప్పావుపిళ్ల ఆలోచిస్తున్నాడు.

"అవును. ఒకనాడయితే తప్పకుండా అలా కొట్టేవాడు. ఆ రోజుల్లో ఇంటి పాఠం అప్పచెప్పక పోతే గోడకుర్చీ వేయించే వాడు. చూచివ్రాత వ్రాయకపోతే చేతివేళ్లు విరగగొట్టేవాడు. బడికి సక్రమంగా రాక పోతే పాఠశాల అనబడే ఆ పూరింట దూలానికి వేలాడదీసి కింద నాగదాడిపట్టలు ముళ్ల కంపలు పరిచి "ఇక బడికెగ్గొట్టను! ఎగ్గొట్టను!!" అని 'కుయ్యో!మొర్రో!' అని మొత్తుకొనే వరకు వదిలిపెట్టేవాడు కాదు. ఇంత చేసినా పిల్లవాని భవిష్యత్తు కోసమే అని, అందులో స్వార్థం లేదని పెద్దలు భావించేవాళ్లు. సహకరించేవాళ్లు. కానీ రోజులు మారాయి. ఈరోజుల్లో పిల్లవాణ్ణి పల్లెత్తు మాటంటే-కాస్త నోరున్నతల్లి అయితే పారక చేతబట్టి సరాసరి పాఠశాల మీద పడుతుంది! కాస్త సంస్కారమున్న ఇల్లాలైతే 'ఏం అయ్యోరా? ఈఊళ్లో ఉండాలనా! పోవాలనా?' అని నిలదీసి అడుగుతుంది. ఎందుకీ గొడవలని ఏ గొడవా పట్టించుకోకుండా ఈకాలం బడిపంతుళ్లు జీతపు రాళ్ల కోసం దినాలు లెక్క పెట్టుకొనే స్థితికి దిగజారారు. కాల మహిమ! కాలంతో పాటు మనుషులు మారాలి కాబోలు!" అనుకొనే సరికి అప్పావుపిళ్ల ముడతలు పడిన మొగంలో ఒకలేత నవ్వు వెలిసింది. ఆ నవ్వును ఊతగాకొని పిల్లలు ముందు పడ్డారు.

ఒక్కొక్కడు ముందుకు వస్తున్నాడు. ఒక నిమ్మపండో, అరటి పండో, ఆఖరికి ఒక చాక్లెట్టో అప్పావుపిళ్ల చేతిలో పెడుతున్నారు. వంగి పాదాలకు నమస్కరిస్తున్నారు. అప్పావుపిళ్ల గుండె ఆనందంతో పొంగిపోతూవుంది. తొలకరి చినుకులలో తడిసిన పుడమితల్లిలా హాయిగా ఉంది. వసంతాన్ని చూచిన కోయిల్లా పాడుతూ ఉంది. మౌనంగా!

రామాయణంలో పిడకల వేటలా అప్పుడు మనస్సులో మెదిలింది ఎప్పుడో విన్న విషయం. పట్టణాల్లో ఉపాధ్యాయుడూ, విద్యార్థి చేతులు కలిపి ఒక అగ్గిపుల్లతోనే సిగరెట్లు వెలిగించుకుంటారట! పైగా అది పాదుపు పాటించినట్లని విర్ర వీగుతారట! గురువు శిష్యుడు

కలిసి ఒక టేబుల్ మీద సరస్వతీ పూజకన్నా మిన్నగా బ్రాందీ పూజ చేస్తారట!

అప్పావుపిళ్ల అవమానంతో కుంచించుక పోయాడు. తనది ఉపాధ్యాయకులమని చెప్పుకోవడానికి సిగ్గుపడ్డాడు. అయితే తానొక పరశురాముడు కావాలనుకున్నాడు. గండ్రగొడ్డలి చేతపట్టి యిలాంటి చీడపురుగుల్ని ఛేదించాలనుకొన్నాడు. ఆ పని చేయలేక అంతమాత్రమైనా ఆ మారుమూల పల్లెటూర్లో గురుభక్తి మిగిలి ఉన్నందుకు సంతృప్తి పడ్డాడు. అందుకే విద్యార్థుల్ని హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాడు.

ఒక్కొక్క విద్యార్థి ముందుకు వస్తున్నాడు. వంగి నమస్కరిస్తున్నాడు. ఆశీర్వాదం పొందిన ఆనందమేమో మరి!- తన్మయత్వంతో ఎగిరి గంతులు వేస్తూ గాలిలో తేలిపోతున్నాడు.

అలా ఆశీర్వదిస్తున్న అప్పావుపిళ్ల దృష్టి ఉన్నట్టుండి ఒక పిల్లవాని మీద పడింది. వాడు గుంపుకు దూరంగా వొదిగి నిలబడిఉన్నాడు. ఆ తర్వాత అప్పావుపిళ్ల గుంపును చూశాడు. దాదాపు వంద మందికి పైగా ఉంటారు విద్యార్థులు. ఆ గుంపు నుండి వెలివేయబడినట్లు నిలబడి ఉన్న ఆ పిల్లవాడెవడు?

ఆపిల్లవాడు మాదిగ గంగులు కొడుకు వెంకటయ్య!....వెంకటయ్య తన బడిలోనే అయిదవ తరగతి చదువుతున్న పదేండ్ల పిల్లవాడు!

వెంకటయ్య వైపు తదేకంగా చూశాడు అప్పావుపిళ్ల. వాడి గుండెల్లో గుబులు కన్నుల్లో కనిపిస్తూ ఉంది. కన్నులు ఆశతో ప్రతిఫలిస్తున్నాయి. అయినా కాళ్లకు సంకెళ్లు!-

వాడు రావాలనుకొంటున్నాడు. నమస్కరించాలనుకొంటున్నాడు. అందరిలాగా ఆశీర్వాదం పొందాలనుకొంటున్నాడు.

అయినా వాడి ముందు వంద మంది కట్టగట్టి నిలబడి ఉన్నారు.

వాళ్ళను దాటుకొని రావాలి!- అది సాధ్యమా?

పోనీ!... తానే వెళ్లితే. అమ్మో! ఇంకేమయినా ఉందా? ఆ పల్లెటూళ్లో ఏ రెడ్డసాని కాలుగిరి ఖణిల్లని రంకె వేస్తుందో?! ఏ నాయుడమ్మ నాలుక కొరికి నానా శాపనార్థాలు పెడుతుంతో?...

వెంకటయ్య కంటే నిస్సహాయస్థితిలో ఇరుక్కొన్నాడు అప్పావుపిళ్ల. గుంపులో నుండి ఒక్కొక్క విద్యార్థి వస్తూనే వున్నాడు. నమస్కరిస్తూనే ఉన్నాడు. ఆశీర్వాదం పొంది ఆనందంతో తిరిగి వెళ్లి పోతూనే ఉన్నాడు. యాంత్రికంగా ఆలోచిస్తున్న అప్పావుపిళ్ల మనసు మాత్రం వెంకటయ్య మీదే కొటకలాడుతూ ఉంది. ఎవడు వాడు? ఎవడు వాడు?...అని ప్రశ్నిస్తూనే ఉంది.

ఎవడు వాడా?

తన చెమట ఫలితాన్ని పదిమందికీ పంచిపెడ్తూ ఆపదిమంది కుళ్లుబుద్ధి కుతంత్రంతో తయారుచేసిన అంటరానితనమనే లేబిల్‌ను ముఖాన వేలాడగట్టుకున్న శ్రమజీవనానికి సంకేతం వాడు!

తానే తవ్విన బావిలో నీళ్లు తాను తాగినా తాకినా అంటు అన్న అభియోగానికి ఆనవాలు

వాడు!!

ఊరి ముందర టీ కొట్టులో వాడలోని వాళ్ల కోసం గుంజకు వేలాడగట్టిన సత్తులోటా వాడు!!!

ఈ సత్తులోటా గ్లాసుగా మారి టీ కొట్టులోని గ్లాసులతో కలిసిపోయేదెప్పుడు?

సమాధానం కోసం సతమతమయ్యాడు అప్పావుపిళ్ల. ఆశించిన సమాధానం దొరక్క ఆవేదన పడ్డాడు. అయినా వెంకటయ్య కోసం అడుగు ముందుకు వెయ్యలేక అలాగే నిస్పృహాయంగా నిలబడ్డాడు. వంద మంది తర్వాతే వాడి వంతు. వంద సంవత్సరాల తర్వాతే వాడి బ్రతుకన్నట్లు!

* * * *

జనవరి ఒకటినాడు ఈ సంఘటన జరిగింది. అది జరిగి ఇప్పటికి దాదాపు పదిహేను సంవత్సరాలు దాటింది. ఈ పదిహేనేళ్లల్లో ఆ గ్రామంలో చాలా మార్పులు వచ్చాయి. ప్రాథమిక పాఠశాల మాధ్యమిక పాఠశాల స్థాయికెదిగింది. అందులో చదువుకొనే విద్యార్థుల సంఖ్య రెండింతలయ్యింది. అందుకు తగ్గట్లు ఉపాధ్యాయుల సంఖ్య పెరిగింది. గ్రామస్థులు శ్రమదానంతో ఒక పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. ఆ కార్యాలయంలో ఒక రేడియో వెలిసింది. సాక్షాత్తూ ఓ అమాత్య శేఖరుడే పంచాయతీ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశాడు. ఆ కార్యాలయంలోని రేడియోలో జాతీయత, నిరక్షరాస్యత, అస్పృశ్యత లాంటి పెద్ద పెద్ద మాటలు చెవులు చిల్లులు పడేలా వినిపిస్తూనే ఉన్నాయి. అవి అప్పావుపిళ్ల చెవుల్లో కూడా పడుతున్నాయి. మాటలు మాటలుగా గాలిలో కల్సిపోతూ ఉంటే ఒకనాడు అప్పావుపిళ్ల ప్రాణం కూడా గాలిలో కలిసిపోయింది. అతని ఆత్మశాంతికి ఒకరోజున బడి మూశారు. అయినా అతని ఆత్మ మాత్రం ఊరిముందరి టీ కొట్టులో గుంజకు వేలాడగట్టిన సత్తు లోటా చుట్టూ తిరుగుతూనే ఉంది! ●

-ఆంధ్రప్రభ.( 29-8-1979.)